క్లుప్తంగా

పరామర్శ



తిరుపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ఉదయం కొత్తపల్లె గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ తిరుపాల్‌రెడ్డిని పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపాల్‌రెడ్డి కాలుకు గాయమై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

నివాళి



నాగిరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి నాగిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ పరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బోడపాడు రామసుబ్బారెడ్డి, స్థానిక నాయకులు రోశిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌తో జీవితం నాశనం



సభలో మాట్లాడుతున్న సీఐ మోహన్

ఖాజీపేట : గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవల ద్వారా జీవితాలు పూర్తిగా దెబ్బతింటాయని ఖాజీపేట సీఐ మోహన్ గ్రామస్తులకు సూచించారు. నాగసానిపల్లె గ్రామంలో పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా, ఫ్యాక్షన్ సమస్యలపై అవగాహనా సదస్సుతో పాటు కళాప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్‌తో చాలా మంది పోలీస్ కేసులతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. గ్రామ అభివృద్ధి కూడా కుంటుపడుతుందని అన్నారు. వ్యక్తిగత కక్షలను వీడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు పెంచి చంద్రబాబు మోసం



రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

చాపాడు : వ్యవసాయ అవసరాలకు పగటి పూట 9 గంటల విద్యుత్ అందించడం కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో 7 వేల మెగా వాట్ల విద్యుత్‌ను నాడు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కొని కోట్లాది రూపాయలు ఆదా చేశారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం రెడ్యం మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు కొనసాగే విధంగా జగన్ నిర్ణయాలు తీసుకుంటే కూటమి నేతలు, ఎల్లో మీడియా విష ప్రచారం, గ్లోబెల్ ప్రచారం చేశారన్నారు. నేడు చంద్రబాబు సర్కార్ అత్యధిక రేట్లకు విద్యుత్ కొని రాష్ట్ర ప్రజలను మోసం చేసినా.. నోరు ఎందుకు మెదపరని ప్రశ్నించారు. జగన్ సర్కార్ యూనిట్ రూ.2.49తో విద్యుత్‌ను కారు చౌకగా కొంటే.. నేడు చంద్రబాబు సర్కార్ యాక్సిస్‌తో యూనిట్ రూ.4.60తో కొనడం దారుణమన్నారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

అట్లూరు : గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా లేక తాగునీటి కోసం అల్లాడుతున్న గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఆ గ్రామ వైఎస్సార్ సీపీ సర్పంచు సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాడు. వివరాలలోకి వెళితే.. ఐదు రోజుల క్రితం వీచిన గాలివానకు అట్లూరు మండలం కామసముద్రం గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. విద్యుత్ అధికారులు స్పందించక పోవడంతో ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. దీంతో ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ సర్పంచు రాజవోలు వెంకటసుబ్బారెడ్డి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తూ మండల ప్రజల మన్ననలు పొందుతున్నాడు.

సమస్య తలెత్తితే ఫోన్ చేయండి

పోరుమామిళ్ల : నాలుగు రోజుల క్రితం వీచిన బలమైన గాలుల కారణంగా నాలుగు మండలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయని, తీగలపై చెట్లు, కొమ్మలు పడటం వల్ల తీగలు తెగిపోయాయని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా సిబ్బంది యుద్ధప్రాతిపదికపై పని చేసి ట్రాన్స్‌ఫార్మర్లు బాగు చేశారని, స్తంభాలు, తీగలు సరి చేసి విద్యుత్ పునరుద్ధరించారన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే రైతులు, ప్రజలు ఆయా మండలాల ఏఈలకు ఫోన్ చేయాలన్నారు.

కళకళలాడుతున్న కందిమల్లాయపల్లె

- వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యుత్ దీపాలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణి



స్వామి సంకీర్తన నామం పలిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం : కందిమల్లాయపల్లె(బ్రహ్మంగారి మఠం) కళకళలాడుతోంది. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో నూతన శోభ సంతరించుకుంది. స్వామి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయానికి రంగులతో మెరుగులద్దారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. దేవాలయంతోపాటు పరిసర ప్రాంతాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ప్రాంగణంలో శోభాయమానంగా రంగవళ్లులు వేశారు. ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు.

స్వామి, అమ్మవారి ఊరేగింపు

రెండు రోజుల నుంచి ఈ ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మల్లయ్య, ధనలక్ష్మి, డాక్టర్ యక్కల సురేష్‌బాబు, స్వప్న కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్ఠింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం భక్తుల కాలక్షేపం కోసం నాయిని లక్ష్మీకుమారిచే హరికథను ప్రదర్శించారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వర స్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవింద స్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు.


పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ముఖ్యంగా స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినమైన వైశాఖ శుద్ధ దశమినాడు (ఈనెల 7న) అశేష సంఖ్యలో జనం వస్తారు. మరుసటి రోజైన 8న రథోత్సవం నాడు బ్రహ్మంగారిమఠం జనసంద్రమవుతుంది. ఇప్పటికే స్వామి మాలధారులు, శిష్యులు చేరుకున్నారు. వారి ఎర్రరంగు, కాషాయ వస్త్రాధారణతో కందిమల్లాయపల్లె పురవీధులు కళకళలాడుతున్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల కోసం దేవాదాయశాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని చదును చేయించారు. నిత్య అన్నదాన పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం, దేవాదాయ శాఖతోపాటు మండల అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా తయారు చేశారు. ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతుంది. దాతలు అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను విరివిగా ఏర్పాటు చేస్తారు. మంచినీళ్లు, మజ్జిగ తదితర పానీయాలను అందిస్తారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షిస్తున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతిలను సమర్పించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : ప్రతి సీపీఎం కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని సీపీఎం పట్టణ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ అధ్యక్షతన పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పాలన చేస్తోందని విమర్శించారు. అస్సాం రాష్ట్ర బీజేపీ ప్రభుత్వ సీఎం హిమంతా బిస్వాశర్మ బహిరంగ ప్రకటనలో దేశంలోని పై మూడు వర్ణాలకు సేవలు చేయడానికే శూద్ర కులాలు ఏర్పడ్డాయని చెప్పడం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారన్న విషయం మరోమారు బట్టబయలైందన్నారు. పేద, మధ్య తరగతి, కార్మిక, కర్షక, ప్రజల సమస్యలపై కార్యక్రమాలు, పోరాటాలు, ఉద్యమాలు రూపొందించుకొని ప్రజలకు దగ్గర కావాలన్నారు. అలాగే సీపీఎం జాతీయ 24వ మహా సభల పిలుపు మేరకు బహుళయ పార్టీగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, సర్వేశ్వరమ్మ, విజయ్, సాల్మన్, శాఖ కార్యదర్శులు శేఖర్, వెంకట సుబ్బమ్మ, శ్రీను, నాగలక్ష్మి, నాయకులు విశ్వనాథ్, డేవిడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఒప్పందాల జీవోలు జారీ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 17 రోజుల సమ్మె కారణంగా చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవోలు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.హరి పేర్కొన్నారు. సమ్మెకాలపు ఒప్పందాల జీవోలను జారీ చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటికి ఏడాదిన్నర కావస్తున్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవోలను జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు మస్తాన్‌షరీఫ్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, దేవమ్మ, సహాయ కార్యదర్శులు సత్యరాజు, ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు రామయ్య, కిరణ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు

అట్లూరు : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారి పైనా అయినా చర్యలు తీసుకోక తప్పదని అట్లూరు, గోపవరం ఎస్‌ఐలు రామకృష్ణ, శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం కాలనీలో వారితోపాటు రెండు పోలీసుస్టేషన్ల సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతివీధిలోని ఇళ్లతో పాటు వామిదొడ్లు, కంపచెట్లలో సైతం శోధించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమై ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని చెప్పారు. ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా చేసుకోవాలని, అలాకాకుండా ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా పాల్పడితే అలాంటి వారిని ఉపేక్షించేది లేదని, కాలనీలో అందరూ సోదరభావంతో కలిసికట్టుగా ఉండాలని పేర్కొన్నారు.

ఈతతో సంపూర్ణ ఆరోగ్యం



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఈత నేర్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఫౌండర్ సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి పేర్కొన్నారు. పెన్నానదీ తీరంలోని ఎగ్జిక్యూటివ్ హెల్త్‌క్లబ్‌లో సోమవారం సమ్మర్ స్విమ్మింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో చాలా మంది చిన్నారులు, విద్యార్థులు, యువత ఈత రాక పలు నదులు, కాలువల్లో దిగి చనిపోతున్నారని తెలిపారు. కావున ఈతను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ఈతకు వయోపరిమితి లేదని 70 ఏళ్ల వరకు ఎవరైనా స్విమ్మింగ్ నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్విమ్మింగ్ కోచ్ సురేష్ పాల్గొన్నారు.

పద్యపఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు పద్యపఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువులబాబు పేర్కొన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్యపఠనంతో నైతిక, మానవత విలువలు పరిమళిస్తాయన్నారు. విద్యార్థులతో శతక పద్యాలు చదివించడంతోపాటు పద్యపఠనంలో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవిశంకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది రెహ్మాన్, శారద, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.

అసంబద్ధ విధానాలు ఉపసంహరించుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో ప్రభుత్వం గందరగోళ పరిస్థితులు కలిస్తోందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ఆందోళన కార్యక్రమం చేపడుతామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్ రెడ్డి, మునివర్ధన్ కుమార్, యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, కుళాయిరెడ్డి, అప్సర్ పాషా, వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్ బాషా, ప్రొద్దుటూరు మున్సిపల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, బాబుల్ రెడ్డి, రాజుపాళెం, దువ్వూరు, చాపాడు మండలాల నాయకులు సుభాన్, నారాయణరెడ్డి, మల్లికార్జున్, నరసింహకుమార్, అమీన్, జాన్ సురేష్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఏపీటీఎఫ్ మండల నాయకులు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రమణారెడ్డిలకు మెమోరాండం ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను సన్మానిస్తున్న అధికారులు

చాపాడు : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులతోపాటు ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద సోమవారం వ్యవసాయశాఖ- రైతు సాధికార సంస్థ, ప్రజా భాగస్వామ్య పకృతి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖలు, డీఆర్‌డీఏ శాఖా అధికారులతో 2025-26 ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను వ్యవసాయ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఎంటీ కృష్ణారెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీధర్, యూనిట్ ఇన్‌చార్జి మహేష్, రైతు ఉత్పత్తి సంఘం సీఈఓ స్రవంతి, ఎస్ఎఫ్ మెంటర్ జయన్న, వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా సోమవారం టీబీరోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని అన్నారు. పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి మాట్లాడుతూ భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత, ఆటలు ఆడుకున్న వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అనంతరం పురవీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, ట్రైనింగ్ స్టాఫ్ స్టూడెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కలసపాడు : మండలంలోని మైనార్టీలు మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. మండలానికి 14 యూనిట్లు మంజూరయ్యాయని, 21-55 సంవత్సరాలలోపు వయస్సు గల ఆసక్తి గల మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుని వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు మించరాదన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తప్పక కలిగి ఉండాలని, ఈ యూనిట్లలో 33 శాతం మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల మైనార్టీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మైదుకూరు : ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మైదుకూరు ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను ఎత్తివేయాలని, ఈహెచ్ఎస్ స్థానం పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులకు ఓడీలను వేయాలనే తదితర దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఎస్ రాయుడు, అధ్యక్షుడు ఎస్.నాగరాజు, గ్యారేజీ కార్యదర్శి వైఎస్ రాయుడు, కేసీ కొండయ్య, ఎంవీ రావు, జీఆర్ రెడ్డి, ఎస్ఎం షరీఫ్, వైఎస్ రెడ్డి, ఐవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి కనీస వేతనాలు రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు అన్నారు. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణ సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఆక్రాయిడ్ కమిటీ నివేదిక ఆధారంగా ఉద్యోగ కార్మికులకు బేసిక్ పే కనీసం రూ.35 వేలు ఉంటేనే వారి జీవనం సాగుతుందని తెలిపిందన్నారు. పౌష్టికాహారం ప్రతి కార్మికుడికి అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని డాక్టర్ ఆక్రాయిడ్ కమిటీ తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు మధు, యోసోబు, రమీజా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమయం పాటించండి

పోరుమామిళ్ల : సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ రమణారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని 1,2,3,4 సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో సమావేశమై సమీక్ష చేశారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ఉండటం లేదని, సమయ పాలన మరచిపోయారని, గైర్హాజరవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది కార్యాలయంలో ఉండాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు పూర్తి చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు అర్బన్ : అఖిల భారత యువజన సమాఖ్య బద్వేలు పట్టణ నూతన కమిటీని సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలోని జేవీభవన్‌లో ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దుళ్ళపల్లె ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా లోకేష్, పట్టణ కార్యదర్శిగా మధులతోపాటు 9 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఉద్యమానికి మద్దతు తెలపండి

ప్రొద్దుటూరు : శ్రీబాగ్ ఒప్పందాన్ని అనుసరించి రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ఉద్యమానికి మద్దతు పలకకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూలపాకు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. ఆయన ప్రొద్దుటూరులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అమరావతి మాత్రమే రాజధాని అంటోందని తెలిపారు. రాయలసీమకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అమరావతి రాజధాని కోసం కార్యక్రమాల్లో పాల్గొనడం సరికాదన్నారు. పాల్గొన్నా అందులో సీమ గురించి మాట్లాడక పోవడం దారుణమన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ గంగయ్యకు సోమవారం ప్రజా పక్షం పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రహ్మణి స్టీల్ ప్లాంట్‌కు 10,670 ఎకరాలు కేటాయించారన్నారు. 2018 డిసెంబర్ 27న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు రాయలసీమ స్టీల్ అథారిటీ ద్వారా జమ్మలమడుగు మండలం కంబాలదిన్నె గ్రామంలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారన్నారు. 2021 డిసెంబర్ 23న, 2023 ఫిబ్రవరి 15న రెండు సార్లు స్టీల్ ప్లాంట్‌కు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ కార్యదర్శి మునిసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీవో 77ను రద్దు చేసి, ఆ తర్వాతే ఈ ఏడాది ఐసెట్ నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తేనే జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ ఏడాది నిర్వహించే ఐ సెట్‌కు ముందే జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. సమావేశంలో టౌన్ ప్రెసిడెంట్ శివ నారాయణ, నితిన్, వెంకటేష్, శ్రావణ్, సుదర్శన్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.